
రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:34 (మంగళవారం సాయంత్రం)
సహర్: 4:54 (బుధవారం ఉదయం)

మాయాజాలం

- అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల బాగోతం

- ఉద్యోగులకు పీఎఫ్ ఖాతాలు తీయకుండా సొమ్ము కాజేత
- ఈఎస్ఐ కోసం కూడా వేతనాల్లో కోతలు, లబ్ధి అంతంతే..
- ఇటీవల దిగువస్థాయి ఉద్యోగాలు ఈ పద్ధతినే నియామకం
- పీఎఫ్ జమ చేస్తున్నా నిబంధనల ప్రకారం చెల్లించని పరిస్థితి
- ప్రజాప్రతినిధుల ప్రధాన అనుచరులే ఏజెన్సీల నిర్వాహకులు







మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

మహబూబ్‌నగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ విషయంలో ఏజెన్సీలు మాయాజాలం చేస్తున్నాయి. అగ్రిమెంట్ చేసుకున్న ప్రకారం ప్రభుత్వం నుంచి బడ్జెట్ పొందుతున్న ఏజెన్సీల నిర్వాహకులు ఉద్యోగుల పరిస్థితులను ఆసరాగా చేసుకొని వారికి రావాల్సిన సొమ్మును కాజేస్తున్నారు. ఎవరైనా అడిగితే జమ చేస్తామని చెప్పడమో లేదా సంవత్సరం తర్వాత మీ ఉద్యోగం రెన్యువల్ కాదని చెబుతుండటంతో ఉద్యోగులు కూడా తమకు ఈ ఉపాధి ఉంటే చాలని సరిపెట్టుకుం టున్నారు. అటు అధికారులకు చెప్పలేక, ఇటు తమ వేతనంలో కోతలు విధిస్తూ కాజేస్తున్నారని సతమతమవుతున్నారు. ఏజెన్సీలు సరిగా వేతనాలు చెల్లిస్తున్నాయా, పీఎఫ్, ఈఎస్ఐ సరైన సమయానికి జమ చేస్తున్నారా, లేదా అనేది పట్టించుకొని.. ఒకవేళ నిబంధనల మేరకు నడుచుకోని ఏజెన్సీలను రద్దు చేయాల్సిన ఉపాధి కల్పన శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వం మూడు, నాలుగు పద్ధతుల్లో ఉద్యోగుల నియామకాలను చేపడుతోంది. మొదట నేరుగా ప్రభుత్వ ఉద్యోగులను భర్తీ చేయడం, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, టెంపరరీ ప్రాతిపదికన ఉద్యోగులను తీసుకుంటుంది. ప్రభుత్వ, కాంట్రాక్టు ఉద్యోగులకు నేరుగా ప్రభుత్వం నుంచి వేతనాలు ఖాతాల్లో జమ అవుతాయి.

టెంపరరీ ఉద్యోగులకు లోకల్ అకౌంట్ నుంచి వేతనాలు లేదా భృతి సర్దుబాటు చేస్తారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను మాత్రం ఏజెన్సీ ద్వారా నియమించుకొని ప్రతీనెల వస్తున్న బడ్జెట్ నుంచి ముందు ఏజెన్సీకి చెల్లింపులు చేస్తే తర్వాత ఏజెన్సీల నిర్వాహకులు వారి కమిషన్ తీసుకొని మిగతా మొత్తంలో కొంత పీఎఫ్ కోసం, కొంత ఈఎస్ఐ కోసం కట్ చేసి వేతనం ఉద్యోగి ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. దీనివల్ల ఏజెన్సీలు ఆడిందే ఆట

- మిగతా 6లో..



గద్వాల వ్యవసాయ మార్కెట్

జోరుగా.. జీరో దందా

- వ్యవసాయ మార్కెట్‌కు తగ్గిన ఉత్పత్తులు, పడిపోయిన ఆదాయం

- గత ఏడాది వచ్చిన ఆదాయం రూ. 5.28 కోట్లు
- ఈ ఏడాది రూ.4.38 కోట్లు మాత్రమే
- పాలకవర్గంలో కమీషన్ ఏజెంట్లతో పాలన
- సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న రైతులు

గద్వాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఆదాయంలో నెంబర్ వన్‌గా ఉండే గద్వాల వ్యవసాయ మార్కెట్ వెనకబడిపోతున్నది. గత ఏడాది రూ.5.28కోట్ల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.4.38కోట్లు మాత్రమే వచ్చింది. పాలకవర్గంలో కమీషన్ ఏజెట్లుతో పాలన నిర్వహిస్తుండటం, జీరో దందాను ప్రోత్సహిస్తుండటంతోనే ఆదాయం పడిపోయిందనే ఆరోపణలు వస్తు న్నాయి. ఈ ఏడాది వానకాలంలో సమృద్ధిగా పంటలు పండినా ఆశించిన మేరకు ఉత్పత్తులు మార్కెట్‌కు రాలేదు. గత ఏడాది మార్కెట్‌కు అన్ని ఉత్పత్తులు 5,14,864 క్వింటాళ్ల రాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 3,16,922 క్వింటాళ్లు మాత్రమే వచ్చిం ది. అంటే పండించిన పంట ఎక్కడపోయిందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మార్కెట్‌లో జీరో దందా కారణంగానే లెక్కలు సరిగా చూపించలేదని, అందుకే మార్కెట్ ఆదాయం పడిపోయిందనే ఆరోపణలు వస్తున్నాయి.

మార్కెట్‌కు తగ్గిన ఉత్పత్తులు

గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలతో పాటు పెబ్బేరు, ఆత్మకూర్ ప్రాంతాల నుంచి కూడా రైతులు పంటలు విక్రయానికి తీసుకువస్తుంటారు. ఈ ఏడాది వేరుశనగతో పాటు వరి మార్కెట్‌కు చాలా వరకు తగ్గిపోయింది. గత ఏడాది వేరుశనగ 2,72,764 క్వింటాళ్ల రాగా ఈ ఏడాది 1,74,541 క్వింటాళ్ల మాత్రమే వచ్చింది. అదేవిధంగా వరి గత ఏడాది 1,81,394 క్వింటాళ్ల రాగా ఈ ఏడాది 1,24,452 క్వింటాళ్ల మాత్రమే వచ్చింది. పత్తి గత ఏడాది 19,860 క్వింటాళ్ల రాగా ఈ ఏడాది ఒక్క క్వింటాళ్ల కూడ రాలేదు. ఆముదం, కందులు గతే డాది మాదిరిగానే వచ్చాయి. గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు వేరుశనగా ఎక్కవగా రావాల్సి ఉండ గా ఈ ఏడాది రాకపోవడంతో ఆదాయంపై ప్రభా వం పడింది.

చెక్‌పోస్టులతో పెరిగిన ఆదాయం

గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు రెండో ప్రధాన ఆదాయం చెక్‌పోస్టుల ద్వారా వస్తోంది. గతేడాది రూ.24.79లక్షలు రాగా ఈ ఏడాది రూ.56.38 లక్షలు వచ్చింది. దీనికి ప్రధాన కారణం మక్తల్ వైపు ఉండే కృష్ణానది బ్రిడ్జి పనుల కోసం రెండు నెలల పాటు రాకపోకలను బంద్ చేశారు. మక్త ల్, నారాయణ పేట ప్రాంతాల రైతులు నందిన్నె చెక్‌పోస్టు ద్వారా రాయిచూర్‌కు ఉత్పత్తులను తీసుకుపోవడంతో ఈ ఆదాయం వచ్చింది.

ప్రతిపాదించిన పనులకు బ్రేక్

గత పాలకవర్గం మార్కెట్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించడానికి అభివృద్ధి పనులకు తీర్మానాలు చేసింది. రూ.3.89కోట్లతో మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించాలని నిర్ణయించి అనుమతులు తెచ్చుకొని టెండర్లు పిలిచింది. ఆలోపే ప్రభుత్వం మారడంతో పనులకు బ్రేక్ పడింది. ఇప్పు డు వచ్చిన కొత్త పాలకవర్గం కూడా మార్కెట్ అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

జీరోదందాపై నిఘా ఉంచాం



మార్కెట్‌లో జీరో దందాపై నిఘా ఉంచాం. జీరో దందాకు అవకాశం లేదు. గతేడాది టార్గెట్ ఎక్కువగా ఉండటంతో ఆ మేరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది టార్గెట్ తక్కువగా ఉంది. వంద శాతం టార్గెట్‌ను సాధించాం మార్కెట్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

- నర్సింహులు, మార్కెట్ కార్యదర్శి, గద్వాల

ఆదాయం సర్టిఫికెట్ల జారీలో అధికారుల జాప్యం

7

ఆర్డీఎస్, తుమ్మిళ్ల సాగునీటిపై నేడు ఆంధ్రజ్యోతి చర్చా వేదిక

ఆంధ్రజ్యోతి చర్చావేదిక

- సమయం : ఉదయం 10 గంటలు,
స్థలం : ఏజీఆర్ ఫంక్షన్ హాల్, అలంపూర్ చౌరస్తా

అలంపూరు చౌరస్తా, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నడిగడ్డకు జూరాలతో పాటు ప్రధాన నీటి వనరులైన "ఆర్డీఎస్, తుమ్మిళ్ల సాగునీటి నడవడిక" అనే అంశంపై ఆంధ్రజ్యోతి చర్చావేదిక చేపట్టింది. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తాలోని ఏజీఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుంది. అధికార, విపక్షాలు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, రైతుసంఘాల నాయకులు, రైతు కూలీ సంఘాలు, సాగునీటి సంఘాల నాయకులు, కార్మిక సంఘాలు, రైతులు, విద్యావంతులు, మేధావులు తదితర రైతు శ్రేయస్సు కోరే వారు హాజరుకావొచ్చు. ఎన్నో ఏళ్లగా పాలకులకు ఓట్ల ముడిసరకుగా నాడు ఆర్డీఎస్ నేడు తుమ్మిళ్ల మారిన పరిస్థితులలో సాగునీటి పథకాల భవితవ్యంపై జరిగే చర్చలో పాల్గొని తమ అమూల్యమైన సూచనలు చేయవచ్చు.


ఖిల్లాఘణపురంలో నేలవాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ విస్తరణ అధికారి పాండు

అకాల వర్షం.. అపార నష్టం

- అల్లమాయపల్లి శివారులో వడగండ్ల వాన
- వనపర్తి జిల్లాలో 453 ఎకరాల్లో పంట నష్టం
- ఖిల్లాఘణపురం మండలంలో 123 ఎకరాలు, కొత్తకోట మండలంలో 330 ఎకరాల్లో నష్టం


వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో దెబ్బతిన్న వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఖిల్లాఘణపురం/కొత్తకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో అకాల వర్షానికి 453 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఖిల్లాఘణపుం మండలంలో 83 మంది రైతులకు సంబంధించి 123 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి తీవ్ర నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ శాఖ అధికారి మల్లయ్య తెలిపారు. మండలంలోని సల్కెలాపూర్, అప్పారెడ్డిపల్లి, అల్లమాయపల్లి, మల్కిమియాన్‌పల్లి, పర్వతాపూర్, ఖిల్లాఘణపురంలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. అల్లమాయపల్లి శివారులోని 73 ఎకరాల్లో వరి, 22 ఎకరాల్లో మొక్కజొన్న, 28 ఎకరాల్లో మామిడి పంట నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. కొత్తకోట మండలంలో కానాయపల్లి, సంకిరెడ్డి, రాయనిపేట, అమడబాకుల గ్రామాల్లో వ్యవసాయ అధికారుల బృందం పర్యటించారు. కానాయపల్లి, సంకిరెడ్డిపల్లి, రాయనిపేట గ్రామాల్లో 330 ఎకరాల్లో వరి పంట అమడబాకుల, సంకిరెడ్డిపల్లి గ్రామాల్లో 18 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. దెబ్బతిన్న పంటల వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు దామోదర్, ఖిల్లాఘణపురం వ్యవసాయ శాఖ అధికారి మల్లయ్య తెలిపారు.

సీఎంఆర్ అప్పగించిన మిల్లర్లకే ధాన్యం కేటాయింపు

● వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



రాజీవ్ చౌరస్తా, మార్చి24(ఆంధ్రజ్యోతి): వానాకాలం 2024-25 సీజన్‌కు సంబంధించి వంద శాతం సీఎంఆర్ అప్పగించిన మిల్లర్లకు మాత్రమే తదుపరి సీజన్ ధాన్యం కేటాయించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కు మిల్లర్ల నుంచి రావాల్సిన సీఎంఆర్ ధాన్యంపై పౌర సరఫరాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 2023-24 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌కు అప్పగించాల్సిన పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ ధాన్యాన్ని వేగంగా మిల్లర్లు సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత సీజన్‌లో ధాన్యం తీసుకుని ఇప్పటి వరకు సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై కేసులు నమోదు చేసి ఆర్ఆర్ యాక్టు ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశం లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీవిశ్వనాథ్, పౌర సరఫరాల డీఎం జగన్, డీటీలు ఉన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి

- జితేందర్, డీవైఎస్‌వో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గద్వాల అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషిచేస్తానని జోగులాంబ గద్వాల జిల్లా క్రీడలు, యువజన సర్వీసులశాఖ అధికారి జితేందర్ తెలిపారు. విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో క్రీడల స్థితిగతులపై డీవైఎస్‌వో 'ఆంధ్రజ్యోతి'కి పలు విషయాలు వెల్లడించారు.

క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటారా..?

జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఇండోర్ గేమ్స్‌కు కావాల్సిన సౌకార్యలను మెరుగు పరిచేందుకు కృషిచేస్తా. అదేవిదంగా పట్టణంలోని సోమనాద్రి ఫుట్ బాల్ మినీ స్టేడియాన్ని పూర్తిస్థాయి సౌకర్యలతో అందుబాటు లోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తా.

గ్రామీణ క్రీడా ప్రాంగణాల పరిస్థితి ఏమిటి..?

జిల్లాలో పలు గ్రామీణ క్రీడా మైదానాలు నిరుపయోగంగానే ఉన్నాయి. అలాంటి వాటిని గుర్తించి అభివృద్ధి చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా. అన్ని మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా మైదానాలను పరిశీలించి సమగ్ర నివేదికను సిద్ధం చేస్తాం.

విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంచనున్నారా..?

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది నిర్వహించే పోటీలకు విద్యార్థులను సమాయాత్తం చేసేలా వ్యాయామ ఉపాధ్యాయులు తగిన ప్రణాళిక చేపట్టారు. దాంతో పాటే జిల్లాలో జరిగే వివిధ రకాల సంబురాలు, ఇతర ఈవెంట్స్ సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించేందుకు దాతల సహకారం కోరుతాం.

సమర్థ క్రీడాకారుల గుర్తింపునకు ప్రయత్నం చేస్తున్నారా.. ?

జిల్లాలో వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులను వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చి అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చి దిద్దుతున్నారు. జిల్లా నుంచి కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్ క్రీడల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారు. వీరికి వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ సంఘాల క్రీడా కోచ్‌లు సహకారం అందిస్తున్నారు.

సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారా..?

సీఎంకప్ పోటీలకు జిల్లా నుంచి కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, హాకీ, బాస్కెట్ బాల్, అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ పోటీల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. అథ్లెటిక్స్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. అలాగే ఫుట్‌బాల్‌లో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం లభించింది.

పంటలు ఎండుతున్నాయ్..

- సాగునీరందించాలని కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా
- 16 గ్రామాల్లో 20 వేల ఎకరాలకు నీటి కొరత
- మరో 20 రోజులు సాగునీరు అందించాలి


ఎండిన వరి పంటతో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

గద్వాల న్యూటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సాగునీరందక పంటలు ఎండుతున్నాయని రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు కింద అలంపూర్ నియోజకవర్గంలోని 16 గ్రామాలలోని 20 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని సోమవారం జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా చేశారు. ఈ ధర్నాకు వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతు జనార్దన్‌గౌడు మాట్లాడుతూ.. అలంపూర్ నియోజకవర్గంలోని సింధనూరు, కుట్కనూర్, తొత్తినోనిదొడ్డి, భైనపల్లి, కొత్తపల్లి, రాజాపురం, పులికల్, కిసాన్‌నగర్, తాండ్రపాడు, ఉప్పల, నౌరోజీక్యాంపు, వేణిసోంపురం, కేశపురం గ్రామాల రైతుల పొలాలు ఆర్డీఎస్ కెనాల్ కింద ఉన్నాయి. ఈ ఏడాది యాసంగి పంటకు 34వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో రైతులు ఆర్డీఎస్ కింద వివిధ రకాల పంటలు సాగుచేశారు. ప్రస్తుతం పంటలు ఎండుతున్నాయి. దీంతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నామని తెలిపారు. పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ ధర్నా విరమింపజేసేందుకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా కలెక్టర్‌ను కలిసేదాకా కదిలేది లేదని భీష్మించుకు కుర్చున్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి మరో 20 రోజులు సాగునీరు విడుదల చేస్తే తప్ప పంటలు చేతికందే పరిస్థితి కనిపించడం లేదని, సాగునీరు విడుదల చేయించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రంగన్న, సవారన్న, రమేష్, అంజనేయులు, బుడ్డన్న తదితరులు ఉన్నారు.

తరగతి గదుల్లోనే

వసతి, బోధన

- బిజినేపల్లి గురుకుల పాఠశాలకు సొంత భవనం కరవు
- పదేళ్లుగా అద్దె భవనంలో నిర్వహణ
- నెలకు రూ.1.30లక్షల అద్దెల చెల్లింపు
- ఇరుకు గదుల్లో 500 మందికి పైగా విద్యార్థులు

7

మన మామిడి ఫ్లైటెక్కేనా?

- నేడు విదేశీ ఎగుమతులపై రైతులతో సమావేశం
- ఇప్పటి వరకు ఒక్క కాయ కూడా తీసుకెళ్లని దుస్థితి

పెద్దమందడి మండలంలో కాసిన మామిడి కాయలు



6

(5వ పేజీ తరువాయి)

పాడిందే పాటగా పరిస్థితి తయారైంది. వేతనంలో భారీ కోతలు విధిస్తూ చెల్లింపులు మాత్రం ఆ స్థాయిలో చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము కాజేత

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పేరుకు ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్నప్పటికీ వారు ఏజెన్సీ ఉద్యోగులు అన్నట్లే లెక్క. ప్రభుత్వం కొంత బడ్జెట్ కేటాయించి ఆ మేరకు ఉద్యోగులను నియమించుకుంటుంది. జిల్లా ఎంపిక కమిటీల ద్వారా వారి నియామకం జరిపి ఏజెన్సీల ద్వారా అపాయింట్‌మెంట్స్ ఇస్తారు. ప్రతీ ఏడాది వారిని రెన్యువల్ చేస్తారు. కొన్ని ఏజెన్సీలు సమయానికి అనుగుణంగా వేతనాలు వేయడంతో పాటు అందరికీ పీఎఫ్ ఖాతాలు తీయించి ప్రతీనెల జమ చేస్తున్నారు. కానీ, మెజారిటీ ఏజెన్సీలు ఉద్యోగ అవసరాలను ఆసరాగా చేసుకొని పీఎఫ్ సొమ్మును కాజేస్తున్నారు. ఎంత వేతనం వస్తుంది, ఎంత కోత విధిస్తున్నారో లెక్కలు కూడా చెప్పని పరిస్థితులు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి మొదటి వారంలో పే వేతనాలు వస్తున్నాయి. కానీ, చిన్నచిన్న మొత్తాలు వేతనాలుగా ఉన్నవారు నెలల తరబడి రాని దుస్థితి ఉన్నది.

మాయాజాలం

అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల భాగోతం

కొన్నిసార్లు ప్రభుత్వం నుంచి అందుతున్న ఏజెన్సీలు జమ చేయడంలో ఆలస్యం చేస్తున్నాయి. ఉదాహరణకు ఒక ఉద్యోగి వేతనం రూ. 15 వేలు ఉంటే అందులో రూ. 2వేలు కోత విధిస్తున్నారు. దానికి కొంత ప్రభుత్వం నుంచి వస్తున్న సొమ్మును కలిపి పీఎఫ్ ఖాతాలో ఏ నెలకు ఆ నెల జమ చేయాలి. కానీ, ఆ రూ. 2 వేలు ఏజెన్సీల నిర్వాహకులే దోచుకుంటున్నారు. వైద్య, విద్యాశాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అధికంగా ఉంటారు. వారందరి పరిస్థితి దాదాపు ఈ విధంగానే ఉన్నది. ఆఫీస్ సబార్డినేట్స్, ఓటీ అసిస్టెంట్స్, ల్యాబ్ అసిస్టెంట్స్, స్వీపర్లు, పేషెంట్ కేర్ వర్కర్లు, రికార్డు అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఇలా చాలా పోస్టులు అవుట్ సోర్సింగ్ పద్ధతిలోనే నియమించుకుంటున్నారు. వారందరూ ఉద్యోగం ఉంటే చాలనే పరిస్థితుల్లో ఉన్నవారే. అయితే భారీగా కోతలు పెడుతున్నప్పటికీ ఏజెన్సీలను నిర్వహించే ఉపాధి కల్పన శాఖ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

రాజకీయ నాయకుల అనుచరులే...

ఏ ప్రభుత్వ ఉంటే ఆయా ప్రజాప్రతినిధుల అనుచరుల చేతుల్లోనే ఈ ఏజెన్సీలు ఉంటున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి ఈ ఏజెన్సీల నిర్వాహకులు జంప్ కొడుతున్నారు. నిత్యం ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేయడం, వారు చెప్పిన వారిని ఏజెన్సీల్లో నియమించుకోవడం వంటివి చేస్తున్నారు. అధికారులు కూడా ప్రజాప్రతినిధులు చెప్పిన ఏజెన్సీలతో అగ్రిమెంట్ చేసుకోవడం, వారు ఇచ్చిన జాబితా ప్రకారమే ఉద్యోగులను తీసుకోవడం వంటివి చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, మంత్రుల క్యాంపుల నుంచే ఉద్యోగుల జాబితాను పంపించి అధికారులతో ఆమోదం చేసుకున్న పరిస్థితి ఉన్నది. ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన మెడికల్ కాలేజీలు, జిల్లా జనరల్ ఆసుపత్రులు, మాతా శిశు సంరక్షణ కేంద్రాల్లో ఈ ఉద్యోగులను పెద్ద సంఖ్యలో నియమించారు.

అయితే ప్రజాప్రతినిధుల అనుచరులు కావడమో లేదా ఏ పార్టీ అధికారంలో ఉంటే వారి చుట్టూ చక్కర్లు కొట్టడం, మంచి చేసుకోవడంతో ఈ ఇబ్బం దులు తప్పడం లేదు. లెక్కాపత్రం లేకుండా వేతనాల్లో కోతలు, పీఎఫ్ జమ చేయకపోవడం, ఇప్పటివరకు కొందరికి యూఏఎన్ (యూనిక్ ఐడెంటిఫికేషన్ నెంబర్) ఇవ్వకపోవడం, ఈఎస్ఐ లబ్ధి చేకూర్చకపోవడం వంటివి ఏజె న్సీల నిర్వాహకాలుగా ఉన్నాయి. ఉదాహరణకు మహబూబ్‌నగర్ జీజీహెచ్ పరిధిలో 204 మంది వివిధ రకాల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో ఎంటీయూ ప్రకారం రూ. 15,600 వేతనం ఉద్యోగికి చెల్లించాలి. దీనికిగాను రూ. 3600ల్లో ఏజెన్సీ వాటా, ఉద్యోగి వాటాను కలిపి రూ. 3600 పీఎఫ్ ఖాతాల్లో జమ చేయాలి. కానీ, కేవలం రూ. 7193 వేతనానికి రూ. 1726 మాత్రమే జమ చేస్తున్నారు. మిగతా మొత్తం రూ.1874 కాజేస్తున్న పరిస్థితి. వనపర్తి జీజీహెచ్ పరిధిలో ఇప్పటివ రకు పీఎఫ్ ఖాతాలు, యూఏఎన్‌లేని ఉద్యోగు లు పదుల సంఖ్యలో ఉన్నారు. అయితే ఏజెన్సీ లకు బదులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే వీరి ఆగడాలకు చెక్ పెట్టవచ్చనే అభిప్రాయం ఉన్నది.


మన మామిడి ఫ్లైటెక్కేనా?

» నేడు విదేశీ ఎగుమతులపై రైతులతో సమావేశం » సమావేశాలే తప్పా చర్యలు శూన్యం » ఇప్పటి వరకు ఒక్క కాయ తీసుకెళ్లని వైనం



వీపనగండ్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మామిడికి ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. రుచి, నాణ్యతకు పెట్టింది పేరు. ఈ మామిడిని క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో విదేశాలకు ఎగుమతి చేస్తామని ప్రభుత్వ అధికారులు ప్రకటనలు చేస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కానీ ఒక్క కాయ కూడా ఫ్లైట్ ఎక్కలేదని, దీంతో విదేశీ ఎగుమతులపై నమ్మకం పోయిందని రైతులు వాపోతున్నారు.

2022లో అవగాహన కల్పించి..



వీపనగండ్లలో కాసిన మామిడి కాయలు

అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థ ద్వారా మామిడిని ఎగుమతిని చేయాలన్న ఉద్దేశంతో 2022లో హైదరాబాద్‌లో కొనుగోలుదారులు, అమ్మకందారులతో సమావేశం నిర్వహించారు. కాయ నాణ్యత ఏ విధంగా ఉండాలి కటింగ్ ఎలా చేయాలి? ప్రమాణాలు ఏవిధంగా పాటించాలి దానిపై అవగాహన కల్పించారు. ఎగుమతులు చేయడంతో వచ్చే లాభాల గురించి తెలిపారు. మండలానికి ఒకటి, రెండు ఎగుమతిదారుల టీమ్‌ను కేటాయించి తోటలకు పంపించారు. రైతులను కలిసి శాంపిల్స్ తీసుకెళ్లి నాణ్యత ప్రమాణాల పరిశీలన చేసి కాయ ఎంపికైందని చెప్పారు. వారం రోజుల్లో కటింగ్ పెడతామని, రెండు రోజుల్లో ధర నిర్ణయిస్తామని తెలిపారు. ఆ తర్వాత వారు కనిపించలేదు, ఫోన్లకు స్పం దించలేదని రైతులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఒక్క కాయ కూడా ఎగుమతి చేయలేదని, సమావేశాలు నిర్వహించి ప్రజలను మోసం చేశారని వాపోయారు.

నేడు మళ్లీ ఎగుమతులపై సమావేశం

విదేశాలకు ఎగుమతిపై కొనుగోలుదారులు, అమ్మకందారులతో మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో సమావేశం నిర్వహించి ఒక టన్ను కూడా ఎగుమతి చేయని అధికారులు ఇప్పుడు చేస్తారా? అని అనుమానాలు రైతుల్లో కలుగుతున్నాయి. సమావేశానికి కూడా వెళ్లాలా? వద్దా అని తర్జనభర్జన పడుతున్నారు. వెళ్లడం వల్ల ఫలితం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో పని చేసి ఎగుమతులు చేసేలా, పకడ్బందీ చర్యలు చేపట్టి రైతులకు మంచి లాభాలు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

కల్వకుర్తిలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో ఎంఐఎం నాయకులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, మాజీ మునిసిపల్ చైర్మన్లు ఎడ్మ సత్యం, రాచేటి శ్రీశైలం, పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని పేర్కొన్నారు. అంతకు ముందు ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ షాహేద్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, కార్మిక నాయకులు సూర్యప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌గౌడ్, నాయకులు మక్దూమ్, సైదులుగౌడ్, శ్రీనుగౌడ్, ఖాదర్, రవి, శివ, గణేష్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన కాయకల్ప టీమ్



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కాయకల్ప బృందం సభ్యులు

కల్వకుర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కాయకల్ప పిగ్ అసెసెమెంట్ బృందం సభ్యులు పరిశీలించారు. నల్గొండ జిల్లా నకిరేకల్ ప్రాంతీయ ఆసుపత్రి నుంచి వచ్చిన బృందం సభ్యులు ఇందిర, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాంతో కలిసి పరిశీలించారు. జాతీయ స్థాయి ఆరోగ్య మిషన్ ప్రతి సంవత్సరం అందించే కాయకల్ప అవార్డును ఇంటర్నల్ పిగ్ అసెస్‌మెంట్‌లో భాగంగా బృందం సభ్యులు ఆసుపత్రిని సందర్శించారు. ఓపీ, ల్యాబ్, ప్రసూతి విభాగం, ఆపరేషన్ విభాగం, ఫార్మసీ, క్యాంటీన్, మార్చురీని పరిశీలించారు. జాతీయ స్థాయి బృందం తనిఖీ చేసినప్పుడు లోటుపాట్లు లేకుండా ఉండేందుకే పరిశీలించారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ యశోదబాయి, డాక్టర్ విష్ణు, డాక్టర్ ఉదయ్, హెడ్ నర్సు సునీత తదితరులు ఉన్నారు.

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక చర్యలు

అచ్చంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అచ్చంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మహిమూద్ అబ్దుల్ సుభార్ తెలిపారు. సోమవారం ఫారెస్ట్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడారు. అచ్చంపేట రేంజ్ ఫారెస్టు 2,800 హెక్టార్లలో విస్తరించి ఉందన్నారు. చెక్ డ్యాంలు, పర్కులేషన్ ట్యాంక్ నిర్మించి 11 సోలార్ మోటార్ల ద్వారా నీటితో నింపుతున్నట్లు తెలిపారు. వేసవిలో అటవీ జంతువులకు నీటిని అందించేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కాస్త తగ్గిన ఎండలు

మహబూబ్‌నగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత సోమవారం కొంత తగ్గింది. వనపర్తి జిల్లా కొత్తకోట, మిరాసిపల్లి లలో 38.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్‌లో 36.5 డిగ్రీలు, నారాయణపేట, నాగర్‌కర్నూలు జిల్లాల్లో గరిష్ఠంగా 35 డిగ్రీలు నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో అలంపూర్‌లో గరిష్ఠంగా 38.6 డిగ్రీలు, ఇటిక్యాలలో కనిష్ఠంగా 28.1 డిగ్రీలు నమోదైంది.

వైన్‌షాప్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

పెబ్బేరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని భవాని వైన్‌షాప్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తికి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వైన్‌షాప్ రేకులను కత్తిరించి కౌంటర్‌లో ఉన్న రూ.1,500, మద్యం ఎత్తుకెళ్లినట్లు యజమాని నర్సింహారెడ్డి ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి హైదరాబాద్‌కు చెందిన చెంచల శివగా గుర్తించారు. సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బోరు మోటార్ల కేబుల్ వైర్లు చోరీ

వంగూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మం డలంలోని గాజర గ్రామ శివారులో వ్యవసాయ బోరు మోటార్ల కేబుల్ వైర్ల ను ఆదివారం రాత్రి ఎత్తుకెళ్లారు. పొలాల్లోని 20 బోరు మోటార్లకు చెందిన రూ.2లక్షల విలువ చేసే వైర్లను కత్తిరించి ఎత్తుకెళ్లారని రైతులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూములు పోతున్నాయి.. ఆదుకోండి

- ఇప్పటికే 500 ఎకరాలు పోగొట్టుకున్నాం
- దారి మార్చాలంటూ రైతుల ఆవేదన



ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు (ఫైల్)

రేవల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టుల కోసం వ్యవసాయ భూములు ఇచ్చి నష్టపోతున్నామని వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని నాగ పూర్, గౌరిదేవిపల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూములు మొత్తం కోల్పోయి దినసరి కూలీలుగా మారే పరిస్థితి వస్తుందని వాపోతున్నారు.

500 ఎకరాలు కోల్పోయాం

ఇప్పటి వరకు కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టులో సుమారు 200 ఎకరాల భూమి, అదేవిధంగా మిషన్ భగీరథ స్కీం తాగునీటి ప్రాజెక్టు కోసం దాదాపు 50 ఎకరాల భూమిని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో డిండి లిఫ్టు ఇరిగేషన్ కోసం మా భూములే ఇవ్వాల్సి వస్తుందని, అందుకని ఈ ప్రాజెక్టును నాగపూర్, గౌరీదేవిపల్లి పంచాయతీ పరిధిలో కాకుండా ఇతర గ్రామాల గుండా మళ్లించి పనులు మొదలు పెట్టాలని కోరుతున్నారు.

సీఎం దృష్టికి విషయం

ఇదే విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. అదేవిధంగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేసి తమ కష్టాల గురించి చెప్పారు. డిండి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం జనవరి 22న విడుదల చేసిన జీవోను రద్దు చేసి మరొక చోట ఈ ప్రాజెక్టును తీసుకెళ్లాలని వారు కోరారు.

వలస వెళ్లే పరిస్థితి



రైతుల భూములు మిగలకుండా అన్ని ప్రాజెక్టుల కోసం తీసుకుంటే మా రెండు గ్రామాల రైతులు మళ్లీ ముంబాయికి వలస వెళ్లే పరిస్థితి వస్తుంది. మా పిల్లల భవిష్యత్తు గురించి అయినా ఆలోచించి జీవో రద్దు చేసి దారి మారుస్తారని ఆశిస్తున్నాం.

- దొడ్డి శ్రీశైలం, నాగపూర్ గ్రామ రైతు

భూమి కోల్పోతే ఊర్లో ఉండలేం



ఉన్న భూమిని కోల్పోతే గ్రామాలలో ఉండి చేసేదేమీ లేదు. వ్యవసాయం తప్ప మాకు మరొక జీవనాధారం లేదు. బ్రతుకుదెరువు కోసం మళ్లీ గ్రామాన్ని వదిలి వెళ్లే పరిస్థితి వస్తుంది. మా భవిష్యత్ గురించి ఆలోచించి ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకోవాలి.

- కోరుపాల కృష్ణ, గౌరీదేవిపల్లి గ్రామ రైతు

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

మహబూబ్‌నగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భగవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన తనిఖీలో 8 మంది మద్యంతాగి వాహనాలు నడిపి పట్టుబడ్డారు. వీరిని రెండో తరగతి కోర్టులో హాజరుపరచగా ప్రత్యేక జ్యుడీషియల్ న్యాయాధికారి శశిధర్ నలుగురికి రూ.వెయ్యి చొప్పున, ఇద్దరికి రూ.1,500 చొప్పున, ఒకరికి రూ.2వేలు జరిమానా విధించగా మరొకరికి మూడు రోజుల జైలుశిక్ష విధించారు.

కోస్గి రూరల్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలు శిక్ష పడింది. సోమవారం ఉదయం స్థానిక పోలీసులు పట్టణం లో నిర్వహించిన తనిఖీల్లో ఏ.వెంకటయ్య మద్యం తాగి బైక్ నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఎక్కువ మోతాదులో మద్యం తాగి బండి నడపడం తో కేసు నమోదు చేసి కోస్గి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి ఫర్దీన్‌బేగం ఐదు రోజుల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

డాక్టర్లపై బెదిరింపులకు పాల్పడితే చర్యలు



కమిటీ సమావేశంలో పాల్గొన్న సూపరింటెండెంట్, డాక్టర్లు

మహబూబ్‌నగర్ (వైద్య విభాగం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రోగి ప్రాణాలు కాపాడటమే వృత్తిగా పనిచేస్తున్న డాక్టర్లపై బెదిరింపులకు పాల్పడితే ఊరుకునేది లేదని ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాంమోహన్ హెచ్చరించారు. సోమవారం జనరల్ ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన క్రమశిక్షణ చర్యల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ డాక్టరు రోగి చనిపోవాలని వైద్యం చేయడని, బతికించాలనే తపన ప్రతీ డాక్టర్‌లో ఉంటుందన్నారు. అయితే శనివారం జనరల్ ఆసుపత్రిలో ఓ యువకుడు చనిపోయిన సంఘటనలో డాక్టర్ల నిర్లక్ష్యం ఏ మాత్రం లేదన్నారు. కావాలనే కొందరు యువజన సంఘాల నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ట్రీట్‌మెంట్ చేసిన డాక్టర్ బయట తిరిగితే అంతుచూస్తాం అంటూ బాహాటంగా బెదిరింపులకు పాల్పడడం భయాందోళనలకు గురిచే స్తుందన్నారు. ఇలాగైతే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏ డాక్టరు కూడా పనిచేయడానికి ముందుకు రాలేని పరిస్థితి ఉందన్నారు. ఆసుపత్రిలో చనిపోయిన యువకుడికి ముందుగానే కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నాయని, అంతేకాకుండా బయటి నుంచి కొన్ని మత్తుకు సంబం ధించిన మందులు కొని తెచ్చారని, వాటిని చనిపోయిన వ్యక్తి బెడ్‌పై ఉంచి ఈ గందరగోళం సృష్టించారని అన్నారు. ఒకవేళ డాక్టరు తప్పుచేసి ఉంటే పోస్టుమా ర్టం నివేదికలో తేలుతుందని, ఆ డాక్టరుపై చర్యలు తీసుకుంటామన్నారు. డాక్టరుపై బెదిం పులకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవా లని, తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ డీఎస్పీకి వినతిపత్రం సమర్పించనున్న ట్లు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కు మార్ సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, జనరల్ మెడిసిన్ విభాగాదిపతి డాక్టర్ అమరావతి, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నజ్మ, డాక్టర్ బాలశ్రీనివాస్, డాక్టర్ స్వరూప్ ఉన్నారు.

ఎంపీఈవో పోస్టులు రిజర్వు?

» పదోన్నతులపై ఆశలు వదులుకుంటున్న కార్యదర్శులు
» గ్రూప్-2 కోసం 150 పోస్టులు
» జడ్పీ సూపరింటెండెంట్ క్యాడర్ రావడంతో డీపీవో కార్యాలయానికి ఇబ్బంది
» ఎంపీడీవో పోస్టులలో కదలిక వస్తేనే..
» తిరిగిన రానున్న అడ్‌హక్ ప్రమోషన్లు పొందిన ఉద్యోగులు



మహబూబ్‌నగర్ జడ్పీ కార్యాలయం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి24 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శుల పదోన్నతుల తీరు చూస్తుంటే ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్న చందంగా మారింది. గ్రూప్-1 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాలంటే ఎంపీఈవో పోస్టు ఇవ్వాల్సి ఉంటుంది. 2019లో జిల్లా వ్యాప్తంగా ఎనిమిది మంది గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు ఎంపీఈవోలుగా పదోన్నతులు కల్పించారు. ప్రస్తుతం ఎంపీఈవోలుగా పదోన్నతులు కల్పించాలంటే వారికి పెద్ద సమస్యనే ఎదురైంది. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన గ్రూప్ -2 పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన వారికి పలు పోస్టులతో పాటు, 150 ఎంపీఈవో పోస్టులను ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో వారు అన్ని జిల్లాలో ఖాళీలను వెతుకుతున్నారు. ఇప్పటికే పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం జిల్లాలోని మండలాల ఎంపీఈవో ఖాళీల వివరాలు తీసుకుంటున్నారు. గ్రూప్-2 అభ్యర్థులకు జిల్లాకు ఐదుగురిని కేటాయించాల్సి ఉంటుంది. వీరికి ఎంపీఈవో పోస్టులు కేటాయించడానికి తాత్కాలికంగా పదోన్నతులు పొందిన వారు, ఇన్‌చార్జి ఎంపీఈవోలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న వారిని తప్పించి, వీరికి అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో పదోన్నతుల మాట దేవుడెరుగు.. ఉన్న బాధ్యతలు కోల్పోతామని అంతర్మథనం చెందుతున్నారు. గ్రేడ్-1 నుంచి కదిలిక వస్తేనే గ్రేడ్-4 వరకు పదోన్నతులలో కదిలిక వస్తుంది. గ్రేడ్-4 కార్యదర్శులకు పదోన్నతులు వస్తేనే జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-4 కార్యదర్శులుగా పదోన్నతులు లభిస్తాయి. ఈ ప్రక్రియ సుదీర్ఘకాలంగా సాగేదిగా ఉండడంతో పదోన్నతులపై పంచాయతీ కార్యదర్శులు ఆశలు వదులుకుంటున్నట్లు తెలుస్తుంది.

జడ్పీ నుంచి రావడం సమస్యే

జిల్లా పరిషత్, పంచాయతీ కార్యాలయ కమిషనరేట్ కార్యాలయం ఒక్కటే కాని, జడ్పీ ఉద్యోగులు పదోన్నతులలో డీపీవో, ఎంపీడీవో కార్యాలయాలు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం, జిల్లా పరిషత్ పాఠశాలలకు వెళ్లే వెసులుబాటు ఉంటుంది. డీపీఓ, మండల పరిషత్ కార్యాలయంలో భర్తీ అయిన ఉద్యోగి అవే కార్యాలయాల్లో పదోన్నతి పొందాల్సి ఉంటుంది. వారు పదోన్నతులు ఎక్కువ శాతం పొందలేక, ఉద్యోగ జీవితంలో పదోన్నతి లేకుండానే విరమణ పొందిన వారు చాలా మంది ఉన్నారు.

ఎంపీడీవోల వివరాలు అడిగారు



ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న ఎంపీడీవో లకు డిప్యూటీ సీఈవోలు గా పదోన్నతులు కల్పించేందుకు రాష్ట్ర పంచాయ తీ రాజ్ శాఖ అధికారులు వారి వివరాలను అడిగారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 56 మంది ఎంపీడీవోల వివరాలు అడిగితే, అందులో మహబూబ్‌నగర్ జిల్లాలో పని చేస్తున్న వారి పేర్లు లేవు. రానున్న రోజుల్లో మరికొం త మంది వివరాలు అడిగితే పంపించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇతర అధికారుల పదోన్నతుల ప్ర క్రియ సమాచారం జిల్లా పరిషత్ పరిధిలో ఉండదు. అది మొత్తం జిల్లా పంచాయతీ శాఖ కార్యాలయం పరిధిలోకి వస్తుంది. పదోన్నతలపై ప్రభుత్వం నిర్ణ యం తీసుకోవాల్సి ఉంటుంది.

-వెంకట్ రెడ్డి, జడ్పీ సీఈవో, మహబూబ్‌నగర్

ఎంపీడీవోలకు పదోన్నతులు వస్తేనే

2004లో ఎంపీడీవో పోస్టులను గ్రూప్-2 అభ్యర్థులతో భర్తీ చేశారు. 2007 నుంచి ఎంపీడీవో పోస్టులను గ్రూప్1 అభ్యర్థులతో ప్రభుత్వం భర్తీ చేస్తుంది. 2004లో ఎంపీడీవోలుగా బాధ్యతలు చేపట్టిన వారికి 15ఏళ్ల అనంతరం జిల్లా విభజన తర్వాత ఎంపీడీవోలకు ఏపీడీలుగా, జడ్పీ ఏవోలుగా, డ్వామా ఏపీడీలుగా పదోన్నతులు కల్పించారు. వారిలో కొంతమందికి డీఆర్‌డీఈవోలుగా, జడ్పీ సీఈవోలుగా కల్పించారు. జడ్పీ నుంచి సూపరింటెండెంట్‌లుగా సీనియారిటీ ఉన్న వారికి ఎంపీఈవోలుగా అవకాశం కల్పించారు. రెగ్యులర్ ఎంపీడీవోలు పదోన్నతుల కోసం వేచి చూస్తున్నారు. వీరికి పదోన్నతులు కల్పిస్తేనే పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించే అవకాశం ఉంటుంది.

అడ్‌హక్ పదోన్నతులు పొందిన వారు వెనక్కు..

జిల్లాలో అడ్‌హక్ పదోన్నతులపై కొంత మంది సూపరింటెండెంట్లు ఎంపీడీవోలుగా, సీనియర్ అసిస్టెంట్లు సూపరింటెండెంట్లుగా, ఎంపీఈవోలుగా పదోన్నతులు పొందారు. గ్రూప్-2 అభ్యర్థులకు ఎంపీఈవోలుగా ప్రభుత్వం నియమిస్తే అడ్‌హక్ ప్రమోషన్లు పొందిన వారు తిరిగి యథాస్థానంలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది.

క్రైం కార్నర్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

» జూరాల బ్యాక్ వాటర్‌లో తేలిన మృతదేహం

» రెండు నెలల క్రితమే వివాహం


సుజయ్ కులకర్ణి (ఫైల్)

అమరచింత, మార్చి24(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జూరాల బ్యాక్ వాటర్‌లో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్ఐ సురేష్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ గ్రామానికి చెందిన సుజయ్ కులకర్ణి (25) ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. తల్లికి వీడియో కాల్ చేసి మాట్లాడి తాను చనిపోతున్నానని పెట్టేశాడు. ఫోన్, ల్యాప్‌టాప్, బైక్ గోడపై పెట్టి నీటిలోకి దూకేశాడు. పదే పదే ఫోన్ చేయగా, అటు నుంచి వెళ్తున్న బాటసారులు ఫోన్ ఎత్తి వివరాలు చెప్పారు. దీంతో వెతుక్కుంటూ వచ్చిన తండ్రి వామనరావు జూరాల వద్ద ద్విచక్రవాహనం గుర్తించారు. వెంటనే వనపర్తి జిల్లా అమరచింత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దీనిపై పోలీసులు గాలించారు. తాజాగా సోమవారం మధ్యాహ్నం సుజయ్ కులకర్ణి మృతదేహం జూరాల బ్యాక్ వాటర్‌లో తేలడంతో జాలర్ల సహాయంతో బయటికి తీశారు. పోలీసుల సమాచారం మేరకు మృతుడి కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని తమ కుమారుడిగా గుర్తించారు. మృతుడికి రెండు నెలల క్రితమే వివాహమైంది. కుటుంబాల కలహాల కారణంగానే బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని ఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు.

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మహమ్మద్ మహమూద్ (60)మృతి చెందినట్లు ఏఎస్ఐ చంద్రయ్య సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం.... నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ మహమూద్ పొలం దగ్గరికి వెళ్లి కరెంటు మోటారు ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పొలం దగ్గరికి వెళ్లిన తండ్రి చాలాసేపు అయినా రాకపోవడంతో అతని కొడుకు మొహమ్మద్ మక్బూల్ చాలాసార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో పక్క పొలం రైతులకు ఫోన్ చేసి ఓ సారి తన తండ్రిని చూడమని చెప్పడంతో వారు వెళ్లి చూడగా, విగత జీవిగా పడి ఉన్నాడు. విషయాన్ని కుటుంబ సభ్యులు తెలుపగా హుటాహుటిన వారు పొలం దగ్గరకు వెళ్లి బోరున విలపించారు. ఈ సంఘటనపై తమ్ముని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా వృద్ధుడు..

అచ్చంపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదంగా వృద్ధుడు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని బొమ్మన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. సిద్దాపూర్ ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలానికి చెందిన తిరుమలశర్మ (72) 20ఏళ్ల నుంచి బొమ్మన్‌పల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. సోమ వారం గ్రామ సమీపంలో మృతి చెంది ఉండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. కుమారుడు శరమల శరన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ధరూరులో మరొకరు..

ధరూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కొండా శ్రీహరి కథనం మేరకు వివరాలు ఇలా.. అయిజ మండల చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన కురువ కృష్ణ(75) వారం రోజుల క్రితం కుటుంబ సభ్యులతో గొడవ పడి ఇంటి నుంచి రేవులపల్లి గ్రామానికి వచ్చాడు. వారం రోజుల క్రితం కుమారుడు కేశవ్ అయిజ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం రేవులపల్లి జూరాల జలాశయం సమీపంలో ముళ్లపొదల నుంచి దుర్వాసన రాగా స్థానికులు వెళ్లి చూడడంతో మృతదేహం కనిపించింది. విషయాన్ని గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ మృతదేహాన్ని పరిశీలించి అయిజ మండలం చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన కురువ కృష్ణగా గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గ్రామ కార్యదర్శి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పెళ్లి ఇష్టం లేక యువకుడి ఆత్మహత్య

ఎర్రవల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోవడం ఇష్టం లేని యువకుడిని కుటుంబసభ్యులు మందలించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రవల్లి మండలంలోని కొండాపేట గ్రామానికి చెందిన సింగోటం కుమారుడైన నరహరి(25) పెళ్లి చేసుకోవాలని కుటుంబసభ్యులు మందలించారు. దీంతో ఆదివారం పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళతో అసభ్య ప్రవర్తన: కేసు నమోదు

నవాబ్‌పేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రం సోమవారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని ఓ గ్రామానికి మహిళ ఇంట్లో వంట చేస్తుండగా, దొమ్మరి యాదయ్య ఇంటి కిటికీ అద్దాల ను కట్టెతో ధ్వంసం చేశాడు. పగిలిన అద్దాలు ఆమె ఒంటిపై పడటంతో బయటకు వెళ్లి చూసింది. అద్దాలు ఎందుకు పగలగొట్టావని యాదయ్యను నిలదీసింది. ఆమెతో పాటు అత్తను భయభ్రాంతులకు గురి చేయంతో పాటు దుర్భాషలాడాడు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి..

» జనాలపైకి దూసుకెళ్లిన బొలెరో వాహనం

» నలుగురికి గాయాలు


దెబ్బతిన్న ద్విచక్రవాహనం, తోపుడు బండి

ఆత్మకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి, తోపుడు బండ్లపైకి బొలెరో వాహనం దూసుకెళ్లిన ఘటన సోమవారం వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఎదుట చోటు చేసుకుంది. ప్రత్యక్షసాక్షుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా ధర్మవరం మండలానికి చెందిన బొలెరో వాహనం ఆత్మకూరు పట్టణం నుంచి అమరచింత వైపు వెళ్తుంది. అదే క్రమంలో అమరచింత నుంచి ఆత్మకూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఎదుట పండ్లు అమ్ముకునే తోపుడు బండ్లపైకి వేగంగా దూసుకువెళ్లింది. రెండు ద్విచక్ర వాహనాలు నుజ్జునుజ్జయ్యాయని తెలిపారు. పండ్లు అమ్మే రామేశ్వరి, కొనేందుకు వచ్చిన మస్తీపూర్ గ్రామానికి చెందిన నర్సింహులు, భార్యాభర్తలకు గాయాల య్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నలుగురు స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్నారు. బొలెరో వాహన డ్రైవర్ శ్రీకాంత్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ విషయమై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నరేందర్ తెలిపారు.

తరగతి గదుల్లోనే వసతి, బోధన

» బిజినేపల్లి గురుకుల పాఠశాలకు సొంత భవనం కరువు

» పదేళ్లుగా అద్దె భవనంలో నిర్వహణ

» నెలకు రూ.1.30లక్షల అద్దెల చెల్లింపు

» ఇరుకు గదుల్లో 500 మందికి పైగా విద్యార్థులు


బిజినేపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం

బిజినేపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారినా పేద విద్యార్థులు చదువుకునే గురుకులాల దుస్థితి మాత్రం మారడం లేదు. అద్దె భవనంలో అరకొర వసతులతో, ఇరుకైన గదుల్లోనే విధిలేక విద్యాబోధన, రాత్రిళ్లు నిద్రాహారాలు కొనసాగిస్తున్నారు. చదువుతో పాటు క్రీడలకు పెద్దపీట వేస్తున్న విద్యాలయాలకు సొంత భవన సమూదాయం, ఆట స్థలం లేదు. దీంతో విద్యార్థులు పూర్తిగా ఆటలకు దూరం కావడంతో శారీరక, మానసిక వికాసాలు పెంపొందడం లేదు. ఈ పరిస్థితి నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో పదేళ్లుగా ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో నెలకొంది.

అందుబాటులో ఐదెకెరాల భూమి..

బిజినేపల్లి మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మినీ గురుకుల పాఠశాలల సమీపంలోని ప్రభుత్వ భూమిలోనే గురుకుల విద్యాలయ భవనం నిర్మించి అవసరమైన వసతులు కల్పించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. మంగనూర్ శివారులో ఐదు ఎకరాల భూమి కేటాయించిన కార్యరూపం మాత్రం దాల్చలేదు. అలాగే మంగనూర్ గ్రామ శివారులో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి కలెక్టర్ బదావత్ సంతోష్, రెవెన్యూ అధికారులు పరిశీలించిన ప్రభుత్వ భూమి, లింగసానిపల్లి గ్రామ శివారులో కూడా విద్యాలయం నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూమి ఉంది. ప్రైవేట్ భవనానికి ప్రతీ నెల రూ.1.30 లక్షల అద్దె చెల్లించాల్సి వస్తుంది. 500లకు పైగా విద్యార్థులు ఉన్న ఈ గురుకుల విద్యాలయానికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించి 2026-27 విద్యా సంవత్సరం ఆరంభంలోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రైవేట్ భవనం పరిస్థితి ఇలా..

మండల కేంద్రంలో గురుకుల విద్యాలయం కొనసాగుతున్న ప్రైవేట్ భవనం ఇరుకైన గదులతో మూడంతస్తుల్లో ఉంది. పై రెండు అంతస్తులల్లో 500 లకు పైగా ఉన్న విద్యార్థుల పుస్తకాలు, దుస్తులు, పడకలతో కలిపి గదికి పది మందికి పైగా ఉండాల్సి వస్తుంది. కింది అంతస్తులో తరగతి గదులతో పాటు స్టాఫ్ రూం, ప్రిన్సిపాల్ ఛాంబర్ ఒక్క గదిలోనే కొన సాగిస్తున్నారు. విద్యార్థులు భోజనం చేసేందుకు రేకులతో షెడ్ వేశారు. వంటగది, సామగ్రి గదులు కూడా ప్రధాన భవనం ఆవరణలో రేకుల గదులు నిర్మించారు. ప్రతీ నెల రూ.1.30 లక్షల అద్దె ప్రభు త్వం చెల్లిస్తున్న సరైన వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లా..



మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయానికి పక్కా భవనం నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. వచ్చే ఏడాది బడ్జెట్‌లో నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగనూర్ శివారులో ఐదు ఎకరాల భూమి కేటాయించారు. భవన నిర్మాణం పూర్తయితే ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్పొరేట్ ధీటుగా విద్యార్థులకు విద్యబోధన, ఆహారం, వసతి అందుతుంది.

- మస్కూరి శంకర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



ప్రైవేట్ భవనంలో సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. విద్యార్థులకు అవసరమైన ల్యాబ్‌లు, క్రీడా ప్రాంగణం, డైనింగ్ హాల్ లేక ఇబ్బందులతోనే నెట్టుకొస్తున్నాం. సమస్యలను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళితే వెంటనే స్పందించి గ్రీన్ బోర్డులు, చైర్లు అందజేశారు. అలాగే పక్కా భవనం నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టిస్తానని భరోసా ఇచ్చారు.

- సుమతి, ప్రిన్సిపాల్, గురుకుల విద్యాలయం, బిజినేపల్లి

కొనసాగుతున్న ఎస్సెస్సీ పరీక్షలు

» పలు పరీక్ష కేంద్రాల తనిఖీ


నారాయణపేటలో పదో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం / నారాయణపేట/ వనపర్తి విద్యావిభా గం/ నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల సర్కిల్ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం పదో తరగతి ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించారు. నారాయణపేట జిల్లాలో 39 కేంద్రాలలో 7,635 మంది విద్యార్థులకు గాను 7,601 మంది హాజరయ్యారు. నారాయణపేట బాలికల ఉన్నత ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేసి పరీక్షల సరళిని పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం సీఎస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఓ గదిలో బియ్యం బస్తాలు నిల్వ చేసిన స్థలంలోనే పెయింట్ డబ్బాలు ఉండటాన్ని గమనించిన వెంటనే తీసి వేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర పరిశీలకుడు దుర్గప్రసాద్ కోస్గిలోని ఐదు కేంద్రాలను పరిశీలించారు. డీఈవో గోవింద్‌రాజులు నారాయణపేట, ధన్వాడలో కేంద్రాలను పరిశీలించారు.

మహబూబ్‌నగర్‌లో 99.66 శాతం హాజరు

మహబూబ్‌నగర్ లో సోమవారం 99.66 శాతం విద్యార్థులు హాజరైయ్యారు. మొత్తం 12,820 మంది విద్యార్థులకు 44 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 12,769 మందికి గాను 32 మంది, ప్రైవేట్ విద్యార్థులు 51 మందికి గాను 12 మంది గైర్హాజరయ్యారు.

వనపర్తిలో 14 మంది గైర్హాజరు

వనపర్తి జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలలో సోమ వారం ఇంగ్లిష్ పరీక్షకు 14 మంది గైర్హాజ రైనట్లు జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని తెలిపారు. జిల్లాలోని పలు సెంటర్లలో పరీక్ష కొనసాగుతున్న తీరును డీఈవో తనిఖీ చేశారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 10,562 మంది విద్యార్థులకు గాను 10,537 మంది హాజరుకాగా 25 మంది వి ద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ కల్వకుర్తి, తాడూరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

పది మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించిన డీఈవో

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని డీఈవో రమేష్‌కుమార్ పరిశీలించారు. ఇప్పటి వరకు వివిధ జిల్లాల నుంచి చేరిన పదో తరగతి జవాబు పత్రాలను భద్రపరిచిన గదికి వేసిన సీల్‌ను తనిఖీ చేశారు. మూల్యాంకనం ఏప్రిల్ 7 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

● జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా 40 పరీక్ష కేంద్రాలలో ఇంగ్లిష్ పరీక్షకు 99.6శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్‌ఘని, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. 7,594మంది హాజరు కావాల్సి ఉండగా 7,564మంది విద్యార్థులు హాజరయ్యారు. గద్వాల మండలం అనంతాపురం, ఎర్రవల్లి పదో బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ తనిఖీ చేసి పరీక్షల నిర్వాహణ గురించి సీఎస్, డీవోలను అడిగి తెలుసుకున్నారు.


నాగర్‌కర్నూల్‌లో పదో తరగతి పరీక్షల మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

ఆదాయం సర్టిఫికెట్ల జారీలో అధికారుల జాప్యం

» డిప్యూటీ తహసీల్దార్‌ను నిలదీసిన అర్జీదారులు


డిప్యూటీ తహసీల్దార్‌ను నిలదీస్తున్న అర్జీదారులు

తిమ్మాజిపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఆదాయం సర్టిఫికెట్లు జారీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులకు, ఇతర వర్గాల వారిని ఇబ్బందులు పెడుతున్నారని పలు గ్రామాల అర్జీదారులు డిప్యూటీ తహసీల్దార్‌ను నిలదీశారు. పలు గ్రామాల విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆదాయం సర్టిఫికెట్లు తప్పనిసరి. అదేవిధంగా ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం ప్రకటించింది. ఇందుకు విధిగా కులం, ఆదాయం సర్టిఫికెట్లు అవసరమవుతాయి. కులం సర్టిఫికెట్లు తహసీల్దార్, ఆదాయం సర్టిఫికెట్లు డిప్యూటీ తహసీల్దార్ ఇవ్వాల్సి ఉంటుంది. మండలంలోని ఆయా గ్రామాల నుంచి వ్యయ ప్రయాసాల కోర్చి తిమ్మాజిపేటకు వస్తే డిప్యూటీ తహసీల్దార్ రూ. లక్షా 60వేలు ఆదాయం వేయడంతో పాటు విద్యార్థులకు ఉపకార వేతనాల కోసం ఇటు రాజీవ్ యువ వికాసం పథకానికి యువతకు ఉపయోగపడడం లేదంటూ సోమవారం పలు గ్రామాల దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌ను నిలదీశారు. ఎలాంటి విచారణ చేయకుండా మీ ఇష్టం వచ్చినట్లు ఆదాయం ఎలా ఎక్కువ వేస్తారని నిలదీశారు.

గుడ్లను పొదిగిన పాము

» 21 గుడ్లలో 10 నీరుగట్టు పాము పిల్లలు బయటికి


జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బయోడైవర్సిటీ కేంద్రంలో గుడ్లలో నుంచి వచ్చిన నీరుగట్టు పాములు

జడ్చర్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో నీరుగట్టు పాము గుడ్లను పొదిగింది. సోమవారం 21 గుడ్లలో 10 గుడ్ల నుంచి పాములు బయటికి వచ్చాయి. నాలుగు రోజుల క్రితం మండలంలోని నసరుల్లాబాద్ గ్రామంలోని ఓ ఇంట్లోకి పాము వచ్చింది. ఈ విషయాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు, సర్పరక్షకుడు సదాశివయ్య దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. వెంటనే ఆయన శిష్యులు వెళ్లి, నీరుగట్టు పామును పట్టుకున్నారు. ఈ పాము పెట్టిన గుడ్లను గుర్తించారు. వెంటనే 21 గుడ్లను కళాశాలలోని బయోడైవర్సిటీ సెంటర్‌కు తీసుకువచ్చారు. పట్టుకున్న పాముతో పాటు గుడ్లలో నుంచి వచ్చిన పాములను అటవీప్రాంతంలో వదిలిపెట్టనున్నట్లు సదాశివయ్య తెలిపారు. కళాశాలలోని బయోడైవర్సిటీ కేంద్రంలో ఇప్పటికే దాదాపు 70 పాము గుడ్లు ఉన్నాయని తెలిపారు. ఐదేళ్లుగా ఇలా దొరికిన గుడ్లు పొదిగేందుకు హైదరాబాద్‌లోని ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీకి పంపించే వాళ్లమని, రవాణాలో కొన్ని గుడ్లు పాడయ్యేవని తెలిపారు. ఎవరైనా దాతలు హ్యాచింగ్ పరికరాలు అందిస్తే స్థానికంగానే పాము గుడ్లను పొదిగించేలా చేసి, సర్పజాతిని రక్షించిన వాళ్లమవుతామని పేర్కొన్నారు. పొదిగిన గుడ్లలో నుంచి వచ్చిన పాములను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య పరిశీలించారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థి అనూషను సన్మానిస్తున్న రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం, ప్రిన్సిపాల్ జయప్రద

మక్తల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా కోయిడ గ్రామంలో ఈనెల 7 నుంచి 9వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ మహిళల ఓపెన్ సైక్లింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ కనరిచింది. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని రాయికోడ్ గ్రామానికి చెందిన అనూష జిల్లా తరఫున ఆడి రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించి, జాతీయ స్థాయి మౌంటెయిన్ సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గోపాలం సోమవారం తెలిపారు. మహబూబ్‌నగర్ పిల్లమర్రి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో అనూష బీకామ్ చదువుతుంది. ఈ సందర్భంగా ఆమెను కళాశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయప్రద, ఫిజికల్ డైరెక్టర్ రజిని, స్వప్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో విద్యార్థి ప్రతిభ


రామకృష్ణను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, బాలసుబ్రహ్మణం

పెద్దకొత్తపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ కొల్లూరులో ఆదివారం నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్ 8వ తరగతి విద్యార్థి కే.రామకృష్ణ రాష్ట్రస్థాయిలో మూడో స్థానం లో నిలిచి బ్రాంజ్ మెడల్‌తోపాటు ప్రశంసాపత్రాన్ని సాధించాడు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఇన్‌చార్జ్ ఎంఈవో కే.శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో, పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు బాలసుబ్రహ్మణ్యం విద్యార్థిని అభినందించారు.

కృష్ణా నీటిలో న్యాయమైన వాటా సాధించుకుందాం

» పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొ.జి.హరగోపాల్

పాలమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నీటిలో న్యాయమైన వాటా సాధించుకుందామని పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొ.జి.హరగోపాల్, కన్వీనర్ యం.రాఘవాచారి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మన ప్రాంతం నుంచి గోదావరి, కృష్ణ రెండు మహానదులు అనేక చిన్ననదులను వాగులు కలిపి వందల కిలోమీటర్లు ప్రవహిస్తున్నా ఆ నీటిని సమృద్ధిగా ఉపయోగించుకున్న చరిత్ర లేదని తెలిపారు. వెయ్యేళ్ల చరిత్రలో ఎక్కడికక్కడ స్థానిక ప్రజలు రెక్కలు పిండి చేసుకుని నిర్మించిన చెరువులు, కుంటలతో కూడిన చిన్న తరహా గొలుసుకట్టు చెరువుల సేద్యమే కానీ భారీ నీటి పారుదల వ్యవస్థల నిర్మాణాలు మనకు లేవని తెలిపారు. ఆంధ్రప్రాంత అనుభవం దీనికి పూర్తిగా భిన్నమైందని పేర్కొన్నారు. గడిచిన 200ఏళ్ల చరిత్రలో ఆంధ్ర ప్రాంతంలో జరిగిన నిర్మాణాలు ఈ వైరుధ్యాన్ని తీవ్రం చేశాయని తెలిపారు. ఈ వైరుధ్యం ఈనాటికి కొనసాగుతూనే ఉన్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ సమాజం ముందున్న తక్షణ కర్తవ్యం, ప్రభుత్వ బాధ్యతలను 16డిమాండ్లతో గుర్తుచేశారు. రాష్ట్ర ప్రజలందరినీ నది జల వాటా సాధన, వినియోగ చర్చలో భాగం చేయటంతో మాత్రమే సాగునీటి సాధనలో న్యాయం పొందగలుగుతామని అభిప్రాయపడ్డారు.

పెచ్చులూడుతున్న కళాశాల పైకప్పు

- శిథిలావస్థ గదిలో ల్యాబ్, ఆఫీస్ నిర్వహణ
- ధ్వంసమైన కిటికీలు
- భయాందోళనలో విద్యార్థులు



ఖిల్లాఘణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ల్యాబ్‌లో పెచ్చులూడిన పైకప్పు

ఖిల్లాఘణపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మూడు దశాబ్దాల కిందట నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం పైకప్పు పెచ్చులూడి ఇనుప చువ్వలు తేలి శిథిలావస్థలోకి చేరింది. కళాశాలలో 112 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా 15 మంది అధ్యాపక బృందం, ఐదుగురు నాన్ టీచింగ్ స్టాఫ్, సైన్స్ విద్యార్థులకు నిర్వహించే ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌తో పాటు కళాశాల వ్యవహారాలు చూసే కార్యాలయం, అధ్యాపకులు విశ్రాంతి తీసుకునే స్టాఫ్ రూమ్ పెచ్చులూడడంతో పాటు కిటికీలు ధ్వంసమై ఉన్నాయి. విద్యార్థులు భయాందోళనల మధ్య ప్రయోగశాలలో ప్రాక్టికల్స్ చేస్తున్నారు. వర్షాకాలంలో కళాశాల గదిలోకి నీరు వస్తుంది. కళాశాలకు కిటికీలు లేకపోవడంతో విష సర్పాలు పురుగులు లోపలికి వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థులు వాపోతున్నారు.

- కళాశాలలోని గదులు మరమ్మతులకు నోచుకోవడం లేదని వాపోతున్నారు. మండల కేంద్రంలో పదో తరగతి వరకు విద్యనభ్యసించిన ప్రస్తుత వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి కళాశాల గదుల మరమ్మతుకు ప్రత్యేక చొరవ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధుల కొరత



శిథిలావస్థకు చేరిన భవనం పరిస్థితిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ల్యాబ్, రికార్డు సెక్షన్ కార్యాలయంలో పైకప్పు పెచ్చులూడుతున్నాయి. నిధుల కొరతతో పాత భవనాల మరమ్మతుకు నోచుకోవడం లేదు. ఏప్రిల్‌లో కళాశాలలకు సంబంధించిన ప్రత్యేక ఇంజినీరును పిలిపించి మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలు పంపుతాం.

- రాజశేఖర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఖిల్లాఘణపురం

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ఫిర్యాదులకు తక్షణమే పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్యతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ... ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 47 ఫిర్యాదులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వచ్చే నెల 1 నుంచి సన్న బియ్యం పంపిణీ

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని రేషన్ కార్డులందరికీ ఏప్రిల్ 1 నుంచి నాణ్యమైన సన్న బియ్యం ఇచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించిందని, ఆ దిశగా రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు సన్న బియ్యం మాత్రమే పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం సరఫరా అంశంపై సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రేషన్ డీలర్లు, పౌర సరఫరాల అధికారులతో మాట్లాడారు. ఏప్రిల్ 1 నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ దొడ్డు బియ్యం పంపిణీ చేయవద్దని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, పౌర సరఫరాల డీఎం జగన్, డీటీలు రేషన్ డీలర్ల సంఘం నాయకులు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశాలు ధర్నాలు చేస్తే అరెస్టులు చేస్తారా?



మదనాపురంలో ఆశా కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు

మదనాపురం, మార్చి 24, (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో ఆశా కార్యకర్తలకు రూ. 18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లిస్తామని చెప్పిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ అన్నారు. గద్దెనెక్కిన ప్రభుత్వం ప్రస్తుతం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. అమలు చేయాలని ఆశా కార్యకర్తలు ధర్నా చేస్తే అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న ఆశాలను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.

గోపాల్‌పేట : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆశా వర్కర్లను ముందస్తు అరెస్టు చేశారు. సోమవారం ఉదయం పోలీసులు వారి ఇళ్లల్లోకి చేరుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పంట నష్ట పరిహారానికి కృషి చేస్తాం



దెబ్బతిన్న వరి పంటలను పరిశీలిస్తున్న గోవిందు నాయక్

వనపర్తి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పంట నష్టం జరిగిన ప్రతీ రైతుకు పరిహారం కోసం తమ వంతు కృషి చేస్తామని అగ్రికల్చర్ గోవింద్ నాయక్ అన్నారు. సోమవారం వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెంలో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించి మాట్లాడారు. వరి పంట తెగులు రాకుండా అగ్రికల్చర్ అధికారులను సంప్రదించాలని సలహాలు సూచనలు తీసుకోవాలని అన్నారు. అగ్రికల్చర్ ఏవో కురుమన్న, ఏఈవో కవిత, నాగపురం కొండన్న, లక్ష్మీకాంత్ రెడ్డి, కొల్లమయ్య పాల్గొన్నారు.

అకాల వర్షం రైతులకు కష్టాలే..

వనపర్తి రూరల్ : వనపర్తి మండల పరిధిలోని రాజపేటలో పంట నష్టం వాటిల్లడంతో రైతులకు కష్టాలు మిగిలాయి. చేతికొచ్చిన వరి పంట నేలపాలు కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గ్రామానికి చెందిన రైతులు తిరుపతయ్య, రత్నమ్మ, అజయ్ కుమార్, రాహుల్ తమకున్న వ్యవసాయ పొలంలో వరి సాగు చేశారు. శనివారం అర్ధరాత్రి కురిసిన అకాల వడగండ్ల వానకు రాజపేట గ్రామంలోని రైతులకు సంబంధించి 14 ఎకరాల్లో సాగు చేసిన వరి పంట పూర్తిగా నేలమట్టమయింది.

కనీస సౌకర్యాలు కల్పించాలి

గోపాల్‌పేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఏదుల నూతన మండలంలో కనీస సౌకర్యాలు కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఏదుల మండల కేంద్రంలో మార్నింగ్ వాక్ కార్యక్రమం చేపట్టారు. వీరాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి మండల కేంద్రంలో స్థానిక ప్రజలతో కలిసి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నడక కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలను సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు.

విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించాలి



పెద్దమందడిలో విద్యార్థులను పరీక్షిస్తున్న ఎంపీడీవో సద్గుణ

పెద్దమందడి, మార్చి24, (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సద్గుణ అన్నారు. సోమవారం ఎంపీడీవో జంగమయాపల్లి తండా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను పరీక్షించారు. విద్యార్థుల్లో నైపుణ్యం వెలికి తీసేలా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖిల్లాఘణపురం : మండలంలోని వెంకటాంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, ఆగారంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను సోమవారం ఎంఈవో జయశంకర్ పరిశీలించారు. వెంకటాంపల్లి ప్రభుత్వ పాఠశాలలోని 4, 5 తరగతి విద్యార్థులు ఎఫ్ఎల్ఎన్ విభాగంలో తెలుగు రీడింగ్, రైటింగ్ స్కిల్స్‌ను విద్యార్థుల్లో పెంపొందిన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు అందించే భోజన వసతిని రుచి చూసి వంట మనుషులకు సూచనలు చేశారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యాబోధన, భోజన పథకం అమలు చేస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచడానికి ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



రాంరెడ్డి, మురళీధర్‌రెడ్డిలను సన్మానిస్తున్న సభ్యులు

కొత్తకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలెంకి చెందిన తండ్రీ కొడుకులు కాంట్రాక్టర్ రాంరెడ్డి, మురళీధర్‌రెడ్డి కొత్తకోటలో నూతనంగా నిర్మిస్తున్న హరిహర ధర్మశాస్త్ర అయ్యప్ప క్షేత్రానికి రూ.పది లక్షల విరాళం అందజేశారు. సోమవారం అయ్యప్ప సేవా సమితి సభ్యులు ఆలయ నిర్మాణ విషయం వారికి తెలపడంతో రూ.పది లక్షల చెక్కును అందజేశారు. దీంతో వారిని శాలువాతో సన్మానించారు. సమితి గోపాలకృష్ణ, నాగరాజు, అనిల్ కుమార్, లింగేశ్వర్, గంగాధర్, సుధాకర్‌రెడ్డి, మణిదీప్, రాజశేఖర్, సాయి, నరేష్ సాగర్, మహేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, రవిరెడ్డి, సంతోష్‌రెడ్డి, ఎల్లారెడ్డి భాస్కర్, రాఘునాథ్‌రెడ్డి ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌కు ఎల్ఈడీ వితరణ

ఖిల్లాఘణపురం : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నిఘా నేత్రాల పరిశీలన నిమిత్తం సోమవారం సామ్‌సంగ్ కంపెనీకి చెందిన 43 ఇంచుల ఎల్ఈడీ టీవీని గ్రామానికి చెందిన బీజేపీ యువ నాయకుడు సిరిసాల సాయినాథ్ సొంత ఖర్చులతో ఎస్ఐ సురేష్ గౌడ్‌కు వితరణ చేశారు. ఎల్ఈడీ దాత సిరిసాల సాయినాథ్‌ను ఎస్ఐ సురేష్ గౌడ్ శాలువాతో సన్మానించారు. శ్రీను, విక్రమ్, శాంతయ్య, గోపాల్, నవీన్, గోపాల్, రామన్ గౌడ్, వంశీ పాల్గొన్నారు.

కేఎల్ఐ కాలువలో కోళ్ల వ్యర్థాలు

రేవల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి కేశంపేట మధ్యలో వెళ్తున్న కేఎల్ఐ కాలువలో మృతిచెందిన కోళ్లను కోళ్ల ఫారం యజమానులు పడవేశారు. ఎవరూ లేని సమయంలో చనిపోయిన కోళ్లను ఇలా తీసుకొచ్చి పడేస్తున్నారని కాలువ పరిధిలోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరు తున్నారు.

వయోవృద్ధులకు శాశ్వత అన్నదానం

పెద్దమందడి, మార్చి 24, (ఆంధ్రజ్యోతి) : వనపర్తి చేయూత అనాథాశ్రమం ఆధ్వర్యంలో మండల పరిధిలోని మూడు గ్రామాల్లోని వయోవృద్ధులకు ఉచిత శాశ్వత అన్నదాన కార్యక్రమాన్ని చేయూత మాతృసేవా అనాథాశ్రమం వర్కింగ్ ప్రెసిడెంట్ విట్టా శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. మండల పరిధిలోని చిన్నమందడి, వీరయ్యపల్లి, దొడగుంటపల్లి గ్రామాల్లోని ఆధారం లేని వయోవృద్ధులకు రోజుకు రెండు పూటలా నిత్య అన్నదాన కార్యక్రమను ప్రారంభించినట్లు చెప్పారు. ప్రభాకర్‌రెడ్డి, రాజప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, చిట్యాల వెంకటయ్య, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన సదస్సు

పెబ్బేరు రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మామిడి పంటలను సాగు చేస్తున్న రైతులకు మామిడి కాయల ఎగుమతులపై మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డు ఎల్ఐసీ ఆఫీస్ ఎదురుగా ఉన్న సుదర్శన్ ఫంక్షన్‌హాల్‌లో అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు హెచ్‌ఓ కృష్ణయ్య తెలిపారు. సదస్సుకు మామిడి తోటల రైతులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లైసెన్సులు లేకుండా కల్లు విక్రయాలు : ముగ్గురు నిర్వాహకులపై కేసులు

పెబ్బేరు రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అనుమతులు, లైసెన్స్‌లు లేకుండా కల్లు అమ్మకాలు చేస్తున్న ముగ్గురు నిర్వాహకులను పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ కరుణ తెలిపారు. మండలంలోని కొత్తసుగూర్, బుడిదిపాడు, జనుంపల్లి గ్రామాల్లో లైసెన్స్‌లు లేకుంగా కల్లు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో శనివారం కల్లు దుకాణాలపై దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా, కల్తీ కల్లును విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

చిన్నంబావి మార్చి 24, (ఆంధ్రజ్యోతి) : కొప్పునూర్‌కి చెందిన చిన్నారెడ్డి, గూడెంకి చెందిన మేకల కృష్ణయ్య యాదవ్ మండల కేంద్రంలోని పెద్దదగడ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 195 లో 0.19 గుంటల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మాణాలను కూల్చివేసినట్లు తహసీల్దార్ ఎండీ ఇక్బాల్, ఎంపీడీవో రమణ రావు తెలిపారు. జీవో నెంబర్ 59 కింది ఆ నిర్మాణాలపై ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నామన్నామని నిర్మాణాలు చేపట్టిన చెన్నారెడ్డి, కృష్ణయ్య తెలిపారు.

న్యూస్ బాక్స్

తై బజార్ వేలం

మదనాపురం, మార్చి24, (ఆంధ్రజ్యోతి) : మదనాపురం గ్రామ పంచాయతీ తై బజార్ వేలంను ఈ నెల 26 నిర్వహించనున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వీపనగండ్ల, మార్చి 24, (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథ కంలో పని చేస్తున్న కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని గంగవరంలో కూలీలు పని చేస్తున్న ప్రదేశాన్ని సందర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలి

కొత్తకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కొత్తకోటను రెవెన్యూ డివిజన్ చేసి రూ.500 కోట్లతో అభివృద్ధి చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి పట్టణ కాంగ్రెస్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, కృష్ణారెడ్డి, బోయెజ్, శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, డా.బాబు, నరేందర్‌రెడ్డి ఉన్నారు.

పాన్‌గల్ వాసికి డాక్టరేట్

పాన్‌గల్, మార్చి 24, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన డా.రాంబాబు కామర్స్‌లో డాక్టరేట్ పొందిన సందర్భంగా విజ్ఞాన దర్శిని, ఆర్గాన్ బాడి డొనేషన్ రాష్ట్ర నాయకుడు బొల్లి ఆదామ్ రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బయో సైన్స్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, శ్రీధర్ శెట్టి, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, గోపాలకృష్ణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల దొంగతనంపై కేసు నమోదు

అమరచింత, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చింతరెడ్డిపల్లిలో గొర్రెల దొంగతనంపై కురువ నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. కురువ నాగరాజు చింతరెడ్డిపల్లి గ్రామ శివారులో సురేష్ పొలంలో గొర్ల మందను నిలుపుకున్నాడు. సోమవారం తెల్లవారు జామున గొర్రెల మందలో 13 గొర్రెలు లేకపోవడంతో కురువ నాగరాజు చుట్టుపక్కల పరిశీలించినా లాభం లేకపోవడంతో అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

27న న్యాయవాద సంఘం ఎన్నికలు

వనపర్తి లీగల్ కంట్రిబ్యూటర్ మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రధాన న్యాయస్థానంలోని న్యాయవాద సంఘం భవనంలో ఈ నెల 27న న్యాయవాద సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు అడహక్ కమిటీ సభ్యులు మోహన్‌గౌడ్, కృష్ణమోహన్‌గౌడ్ తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిందన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్ష పదవికి డి.కిరణ్‌కుమార్, మోహన్‌కుమార్‌యాదవ్, రామచంద్రారెడ్డి పోటీలో నిలిచారు. జనరల్ సెక్రెటరి పదవికి కె. వెంకటరమణ, డి.కృష్ణయ్య పోటీలో నిలిచారు. ఏకగ్రీవంగా మరికొన్ని పోస్టులకు న్యాయవాదులు ఎన్నికయ్యారని తెలిపారు. ఉపాధ్యక్షుడిగా డి.శ్యామ్, జాయింట్ సెక్రటరిగా శంకర్, లైబ్రరీ సెక్రెటరిగా ఎం. యాదగిరి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరిగా రాంధులి, సభ్యులుగా శ్రీనివాస్‌గౌడ్, ఎండీ నిరంజన్, భరత్‌కుమార్, నరేంద్రబాబు, ఎన్. రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు.

నేడు చలో హైదరాబాద్

పాన్‌గల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యల పరిష్కారానికి మంగళవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల గ్రామ పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు సుగ్రీవుడు, యాదగిరి మాట్లాడారు. 9 నెలల నుంచి వేతనాలు ఎస్టీవోలో జమ చేసిన చెక్కులు పాస్ గాక పై నుంచి నిధులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి



మునిసిపల్ డీఈకి సమస్యను వివరిస్తున్న సతీష్ యాదవ్

వనపర్తి టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలు గాలికొదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలోని డీఈని కలిసి 28వ వార్డులో నెలకొన్న సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆరు నెలల కిందట 28వ వార్డులో సీసీ రోడ్డు మంజూరవగా.. రోడ్డును తవ్వి నేటికి రోడ్డు వేయడం లేదన్నారు. దీంతో కాలనీ వాసులతో పాటు ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డును తవ్విన కాంట్రాక్టర్, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గత ఆరు మాసాల నుంచి ఎంతః దగ్గరికి వెళ్లిన లాభం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని వాపోయారు. అదే విధంగా మునిసిపల్ డీఈను కలిసి సమస్య వివరించినా తనకేమి సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచుల రాస్తారోకో



కొత్తకోట చౌరస్తాలో రాస్తారోకో నిర్వహిస్తున్న మాజీ సర్పంచులు

కొత్తకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచులు కొత్తకోట చౌరస్తాలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడారు. తాము సర్పంచులుగా ఉన్నప్పుడు ప్రజల అవసరాల నిమిత్తం ప్రభుత్వ అనుమతితో రోడ్లు, డ్రైనేజీలు, పైపులైను పనులు చేపట్టామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాకు జడ్పీటీసీ మాజీ సభ్యులు విశ్వేశ్వర్, వామన్‌గౌడ్, చెన్నకేశవరెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. రోకోలో మాజీ సర్పంచులు నాగేష్, శంకర్, శ్రీనివాసులు, బుచ్చన్న, వెంకట్రామారెడ్డి తదితరులు ఉన్నారు.

రైతుల సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్యే



కురుమూర్తి రాయ లిఫ్టు వద్ద నీటిని పరిశీలిస్తున్న నాయకులు

మదనాపురం, మార్చి 24, (ఆంధ్రజ్యోతి) : పంటలకు సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతుంటే వారిని ఏ మాత్రం పట్టించుకోకుండా తిరగడం స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికే సాధ్యమైందని బీఆర్ఎస్ మండల నాయకులు విమర్శించారు. సోమవారం రామన్‌పాడు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వద్ద ఉన్న కురుమూర్తి రాయ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పంటలు ఎండిపోతున్న ఎమ్మెల్యే మాత్రం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్, బిట్లియాదగిరి, శివశంకర్, విజయేందర్‌రెడ్డి, కురుమూర్తి, అంజియాదవ్, రాజు కుమార్, రమేష్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై నిర్లక్ష్యం వద్దు



కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

ఆత్మకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పన్నుల వసూళ్లపై నిర్లక్ష్యం చేయవద్దని ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ శశిధర్ పేర్కొన్నారు. మునిసిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు బిల్ కలెక్టర్లు కార్యాలయ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణ కేంద్రంలో ఇంటి, నీటి ఆస్తి, వ్యాపార సముదాయాల వంటి పన్నులు రెండు కోట్ల 35 లక్షలకు గాను ఇప్పటి వరకు కోటి 26 లక్షల రూపాయలు మాత్రమే వసూలు అయ్యాయి. 50 శాతం మాత్రమే వసూలు అయినట్లు తెలిపారు. మరో 50 శాతం పన్నుల వసూళ్ల పై వార్డు ఆఫీసర్లు బిల్ కలెక్టర్లు అహర్నిశలు కృషి చేసి పూర్తిస్థాయి ఇంటి పన్నులు వసూలు చేసే విధంగా చూడాలని ఆదేశించారు.

యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

పెబ్బేరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే కాంగ్రెస్ సర్కార్ ప్రధాన లక్ష్యమని పెబ్బేరు యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేష్ అన్నారు. సోమవారం మునిసిపాలిటీలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గానికి శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగానే స్వయం ఉపాధి పథకం కోసం దరఖాస్తులు ప్రారంభించిందని తెలిపారు. రాజీవ్ యువ వికాసం కింద అర్హులైన వారికి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఇవ్వనుందని పేర్కొన్నారు.

ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబలి కేంద్రం ప్రారంభం



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జూపల్లి అరుణ్

చిన్నంబావి మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కే ఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త కళ్యాణ్ రావు జన్మదినం సందర్భంగా కే ఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జూపల్లి అరుణ్ అంబలి కేంద్రం పారంభించి మాట్లాడారు. మూడు సంవత్సరాలుగా అంబలి కేంద్రం, చలివేంద్రం కొనసాగిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ సీనియర్ నాయకులు మందడి చిదంబర్ రెడ్డి, బీచుపల్లి యాదవ్ బిచ్చన్న యువ నాయకులు జగదీష్ విభీషన్ యాదవ్ పురేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్ప్రింక్లర్ పైపుల పంపిణీ



పైపులను పంపిణీ చేస్తున్న ఉద్యాన శాఖ అధికారి కృష్ణ

వీపనగండ్ల, మార్చి 24, (ఆంధ్రజ్యోతి) : వీపనగండ్ల ఉమ్మడి మండలంలోని కల్వరాల, దగడపల్లి గ్రామాల్లో సోమవారం ఉద్యానశాఖ హెచ్‌ఓ కృష్ణ 63 మంది లబ్ధిదారులకు స్ప్రింక్లర్ పైపులను పంపిణీ చేశారు. మామిడి క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా సబ్సిడీపై రైతులకు మంజూరైన పైపులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో స్ప్రింక్లర్ పైపులు మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకు లు రాజయ్య, వెంకటేష్‌లు తెలిపారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి నరసింహ పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలి

పెబ్బేరు రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టి పీఎం విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తులు చేసుకున్నవారికి రుణాలు ఇవ్వాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా అదునపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు లబ్ధిదారులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సీఎం విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా 670 మంది శిక్షణ పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. 250 మందికి మాత్రమే రూ.లక్ష ప్రకారం రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. మిగతా 420 మంది లబ్ధిదారులకు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మతతత్వం నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకుందాం



జై సంవిధాన్‌పై ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మతతత్వ విధానాల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకుందామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ నసీర్ అహ్మద్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రతో దేశంలో బీజేపీ సొంతంగా అధికారం దక్కించుకోలేక పోయిందన్నారు. 400 సీట్లు అని కలలు కన్న బీజేపీ అబాసుపాలైందని, రాహుల్ గాంధీ సారథ్యంలో పార్లమెంటులో బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నామని అన్నారు. రెండు దఫాలుగా అధికారంలో ఉన్న బీజేపీతో భారత రాజ్యాంగానికి ముప్పు వాటిల్లుతుందని, ఇప్పుడు మూడోసారి అధికారంలో ఉన్న బీజేపీ నుంచి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు సైనికులై ఇంటింటికి తిరిగి బీజేపీ రాజ్యాంగంపై చేస్తున్న కుట్రలను, అంబేడ్కర్ సిద్ధాంతాలను వివరించాలని సూచించారు. అంతకు ముందు హైకమాండ్ రాజ్యాంగ రక్షణ సందేశంతో జిల్లా అధ్యక్షుడు ప్రతిజ్ఞ చేయించారు. ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, కదిరె రాములు, చీర్ల చందర్, సత్యారెడ్డి, వెంకటేష్, శ్రీలతరెడ్డి, దేజ్యానాయక్, సత్యశీలారెడ్డి, రోహిత్, వెంకటేష్, వేణు, పాల్గొన్నారు.